క్లుప్తంగా

నేడు కంటి వైద్యశిబిరం

మునుగోడు : మండల కేందంల్రో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక నాయకులు శనివారం తెలిపారు. హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు చేయనున్నట్లు, మండల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

మర్రిగూడ : మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామంలో భారత్ గ్యాస్ డీలర్ సిబ్బంది ప్రభుత్వం నిర్ణయించిన సిలిండర్ ధర కంటే అదనంగా రూ.65వేలు వసూలు చేస్తున్నారని గ్రామానికి చెందిన సిరిపంగి శ్రీనివాస్ శనివారం తహసీల్దార్ బక్కా శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే సిలిండర్‌కు రూ.65 ఎక్కువగా తీసుకుంటున్న డీలర్‌పై చట్టపరంగా తీసుకోవాలని కోరారు. ఆయన వెంట మైలారపు రాజు, సల్వోజు రామలింగాచారి, సిరిపంగి జంగయ్య ఉన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నకిరేకల్ : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 25నుంచి 28వరకు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల కోరారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, నాయకులు ఆకుల భాస్కర్, నాగమణి, వంటిపాక కృష్ణ, సాకుంట్ల నర్సింహ, గుడుగుంట్ల బుచ్చిరాములు, ఇందిరా, జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

మునుగోడు : నవోదయ పాఠశాలలో చేరేందుకు 6వతరగతి విద్యార్థులకు శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని సెయింట్ జోసఫ్ పాఠశాలల్లో ఏర్పాటు చేసినా పరీక్ష కేంద్రంలో మొత్తం 201మంది విద్యార్థులకు రాయాల్సిఉండగా 127మంది పరీక్షకు హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ టి.మల్లేషం తెలిపారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ కృష్ణమాచారిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు

నకిరేకల్ : పట్టణానికి చెందిన గడగోజు కృష్ణమాచారి ఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ కమిటీ, కార్పెంటర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోపురి చంద్రమౌళి, ప్రతినిధులు సంకోజు నారాయణ, సిద్దోజు భిక్షమాచారి, తాటికొండ లక్ష్మయ్య, గడగోజు నర్సింహాచారి, ధనుంజయ్య, వెంకటాచారి, విశ్వజ్ఞాచారి, నర్సింహాచారి, మదనాచారి, సత్యనారాయణ, సతీష్, వాసు, బ్రహ్మాచారి, తదితరుల పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

కట్టంగూర్ : ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల సర్వేలో భాగంగా లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21నుంచి 23వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.జ్ఞానప్రకాశ్‌రావు శనివారం తెలిపారు. ఈ నెల 21న అయిటిపాముల, భాస్కర్లబాయి, నల్లకుంటబోలు, నారెగూడెం, పిట్టంపల్లి, రామచంద్రాపురం, బొల్లేపల్లి, మల్లారం, 22న ఇస్మాయిల్‌పల్లి, పందెనపల్లి, మునుకుంట్ల, ముత్యాలమ్మగూడెం, పామనగుండ్ల, కల్మెర, కట్టంగూర్, కురుమర్తి, 23న ఈదులూరు, ఎరసానిగూడెం, చెర్వుఅన్నారం, గార్లబాయిగూడెం, పరడ, దుగినవెల్లి గ్రామాల్లో అధికారుల సమక్షంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు, దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరూ హాజరు కావాలని కోరారు.

మునుగోడు : మండలంలో ఈ నెల 21నుంచి 24వరకు రైతు భరోసా, ఇతర పథకాలపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శాంతకుమారి శనివారం తెలిపారు. గ్రామ సభల్లో వివిధ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తిస్తారని, కావున గ్రామస్తులంతా హాజరుకావాలని కోరారు.

‘ఇందిరమ్మ’ దరఖాస్తుల్లో గందరగోళం

- ఇళ్ల నమోదు జాబితాలో పేర్లు మాయం
- ఆన్‌లైన్ తప్పిదంతో వెయ్యిమందికిపైగా వివరాలు గల్లంతు
- నందికొండ మున్సిపాలిటీలో చూపిస్తున్న పలువురి పేర్లు



నల్లగొండ టూటౌన్ : ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న పేదల పేర్లు గల్లంతయ్యాయి. ప్రజాపాలన దరఖాస్తులోనే ఇందిరమ్మ ఇల్లు కావాల్సిన వారు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో ప్రజాపాలన కార్యక్రమంలో నీలగిరి పట్టణంలో 41వేల 281దరఖాస్తులు రాగా వాటిలో ఇందిరమ్మ ఇంటి కోసం 26వేల 548మంది దరఖాస్తులు చేసుకున్నారు. కానీ అంతకంటే ఎక్కువ మంది ఇందిరమ్మ ఇల్లు కావాలని ఎంపిక చేసుకున్నారు. ఇలా దాదాపు వెయ్యి మందికి పైగా ఇందిరమ్మ ఇల్లు కావాలని ఆప్షన్‌ను ఎంపిక చేసుకున్న వారి పేర్లు ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించే ప్రక్రియను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించారు. దీంతో వారు ఒక్కో దరఖాస్తు చొప్పున ధర చెల్లించడంతో వారు ఎక్కువ దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలనే తొందరపాటుతో పేర్లను తప్పులుగా నమోదు చేశారు. గతంలోనే 200యూనిట్లు ఉచిత కరెంట్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ లాంటివి, ఆధార్ నంబర్, ఇంటి చిరునామా, బ్యాంకు ఖాతా నంబర్, గ్యాస్ బుక్ నంబర్ తదితర వివరాలను వందల సంఖ్యలో తప్పులుగా నమోదు చేసినట్లు గతంలోనే గుర్తించిన విషయం తెలిసిందే. అప్పట్లో దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికి సమయం తక్కువగా పెట్టడంతో తొందరపాటుతో తప్పుల తడకగా నమోదు చేశారు. అదే విధంగా ఇందిరమ్మ ఇంటి కోసం చూస్తున్న పేదల కల కళగానే మిగిలిపోయే అవకాశం లేకపోలేదు.

130మంది మళ్లీ దరఖాస్తులు..

నీలగిరి పట్టణంలో ఇందిరమ్మ ఇల్లు కోసం సర్వే నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాము ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నా జాబితాలో తమ పేర్లు లేవని అనేక మంది మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 130మంది తమ పేర్లు లేవని మున్సిపల్ అధికారులకు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. నీలగిరి పట్టణంలో ఉపాధి, పిల్లల చదువుల కోసం వేలాది మంది వచ్చి పట్టణంలోనే ఆధార్, రేషన్‌కార్డులు కలిగి ఇక్కడే స్థిరపడ్డారు. ఇలాంటి వారు వేల సంఖ్యలోనే అద్దె ఇళ్లల్లో నివాసం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా సర్వే కొనసాగుతున్నందున చాలా మంది పేర్లు పోయినట్లు వారికి విషయం తెలియదు. అధికారుల అంచనా ప్రకారం వెయ్యి మందికి పైగా పేర్లు ఆన్‌లైన్ చేసే సమయంలోనే ఇందిరమ్మ ఇంటి కోసం పెట్టుకున్న ఆప్షన్ తప్పిపోయినట్లు భావిస్తున్నారు. ప్రస్తుతం చేస్తున్న సర్వే పూర్తి అయితే వందల సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మళ్లీ వారు మున్సిపల్ కార్యాలయానికి వచ్చే అవకాశం ఉంది. కాగా నీలగిరి మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే నందికొండ మున్సిపాలిటీలో 30మంది దరఖాస్తులు వెళ్లినట్లుగా గుర్తించారు. ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరుగకపోవడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో తమకు ఇబ్బందులు వస్తున్నాయని, తమ పేరు ఎందుకు లేదని కొందరు వచ్చి గట్టిగా ప్రశ్నిస్తుంటే తాము సమాధానం చెప్పలేక పోతున్నామని అధికారులు వాపోతున్నారు.

రికార్డులో వివరాలు నమోదు చేస్తున్నాం

కొంత మంది వచ్చి ఇందిరమ్మ ఇల్లు జాబితాలో తమ పేరు రాలేదని వస్తున్నారు. అలాంటి వారు వస్తే దరఖాస్తు తీసుకొని రికార్డులో పేర్లు నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం అవకాశం కల్పించగానే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. తప్పులు జరిగిన వాటిని సరిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వేముల వీరేశం



అయిటిపాములలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలంలోని అయిటిపాముల గ్రామంలో నిర్మించనున్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను ఆయన ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎనిమిది నెలల్లో ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసి 8వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. ప్రాజెక్ట్ వద్ద నెలకొన్న రెండు ఎకరాల భూ సమస్యను త్వరలో పరిష్కరించి నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతులు మీదుగా పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ గంగం శ్రీనివాసరెడ్డి, డీఈఈ మారం శ్రీనివాస్, ఏఈఈ రాజశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సుంకర బోయిన నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, వల్లపు శ్రీనివాస్‌రెడ్డి, నంద్యాల వెంకట్‌రెడ్డి, ఎడ్ల పెద రాములు తదితరులు ఉన్నారు.

సృజనాత్మక అంశాలతోనే సాంకేతిక పరిజ్ఞానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ నర్సింహానాయక్

తిప్పర్తి : విద్యార్థులు సృజనాత్మకత అంశాలను తప్పక నేర్చుకోవాలని, తద్వారా సాంకేతిక పరిజ్ఞానం పొందుతారని మండల విద్యాధికారి నర్సింహానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ వారి సహకారంతో విద్యార్థులకు డ్రీమ్ రూమ్ అనే అంశంపై సృజనాత్మకత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి ఉత్తమంగా తయారు చేసిన వస్తువులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రథమ్ సంస్థ కోఆర్డినేటర్ సంధ్య, ఉపాధ్యాయులు సదానందం, భిక్షపతి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్, జ్యోతి, హిమమా, జోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సేవలను వినియోగించుకోవాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మంజుల

కేతేపల్లి : న్యాయవిజ్ఞాన సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, నకిరేకల్ మండల న్యాయసేవా కమిటీ చైర్మన్ మంజుల సూర్యావర్ కోరారు. శనివారం మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో నకిరేకల్ మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. న్యాయ సేవా కమిటీలు ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు అందించడంతో పాటు సత్వర పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ప్రతి పల్లెలో ప్రతి వ్యక్తికి న్యాయ విజ్ఞానం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం దేశంలోని పేదరిక నిర్మూలనకు భారత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చట్టాలు, ప్రజలకు ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నకిరేకల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పూజర్ల శంభయ్య, కేతేపల్లి ఎస్ఐ శివతేజ, ఎంపీఓ నాగమణి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ రిటైర్డ్ లాయర్ వంగూరి వెంకన్న, చొగోని నాగరాజు, వైద్యుల ఉపేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాడుతా



తిప్పర్తి మోడల్‌స్కూల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాడుతానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో చర్లపల్లి గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, తిప్పర్తి, నకిరేకల్ రెసిడెన్షియల్, అనుముల బాలుర గురుకుల కళాశాల, నల్లగొండ మైనార్టీ గురుకుల పాఠశాలలలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 42 సంఘాలు బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులందరికీ ఆరోగ్య కార్డులు మంజూరు, సీపీఎస్ విధానం రద్దు చేయించి పాత పెన్షన్ విధానం కోసం కృషి చేస్తానన్నారు. గురుకులాలు, మోడల్‌స్కూల్స్‌లో పనిచేస్తున్న జూనియర్, డిగ్రీ లెక్చరర్లు, ప్రిన్సిపాళ్లకు గెజిటెడ్ హోదా కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉమాకర్‌రెడ్డి, బాలజీనాయక్, ఓంప్రకాశ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గోపాల్‌రెడ్డిని గెలిపించాలి



ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గోపాల్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు

రామగిరి(నల్లగొండ) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ ఉపాధ్యాయుడు పన్నాల గోపాల్‌రెడ్డిని గెలిపించాలని జేఏసీ జిల్లా నాయకుడు డాక్టర్ తోట నరసింహాచారి అన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు కల్లబొల్లి మాటలకు మోసపోకుండా నిబద్ధతతో ఉపాధ్యాయ సమస్యల కోసం పోరాడే వ్యక్తిని గెలిపించాలని కోరారు. టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ.. శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక ఉపాధ్యాయ ఉద్యమ నేత గోపాల్‌రెడ్డి అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరావు, దూదిపాల భాస్కర్‌రెడ్డి, జయ వెంకటనారాయణ, బి.గోపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి, నాయుడు, యాదయ్య, భాస్కర్‌రెడ్డి, పాండరీ, వెంకటరెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాల డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



చిట్యాల : పీఆర్‌టీయూ టీఎస్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సైదానాయక్

నార్కట్‌పల్లి : కుమ్మరి కులస్తుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను శనివారం నకిరేకల్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే వీరేశం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కుల సంఘాలకు ప్రత్యేక నిధులు కేటాయించి వారి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రాధారపు భిక్షపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశం, జిల్లా కోశాధికారి చిట్టిమళ్ల దశరథ, ఎలిజాల వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి నిమ్మనగోటి లింగయ్య, మండల అధ్యక్షుడు నిమ్మనగోటి వెంకన్న, మిడిదొడ్డి రాజు, యాదగిరి, సైదులు ఉన్నారు.

చిట్యాల : మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవన్ ఆవరణలో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని శనివారం ఎంఈఓ పోనుగోతు సైదానాయక్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులంతా డైరీ రాయడాన్ని అలవాటుగా మార్చుకొని ప్రతిరోజు బోధించాల్సిన పాఠ్యాంశాలను ముందుగా రాసుకోని బోధిస్తే విద్యాబోధన ఫలప్రదంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులంతా ప్రణాళికబద్ధంగా విద్యాబోధన చేస్తే విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కంచరకుంట్ల సుధాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎ.వెంకట్‌రెడ్డి, బి.లుకేందర్‌రెడ్డి, వెంకటనర్సింహాచారి, జి.మాధవి, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు ఏ.సత్తయ్య, వి.నాగరాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : కుమ్మరి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలి



తిప్పర్తి : రైతు భరోసా సర్వే వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిప్పర్తి : రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇతర పథకాల కోసం గ్రామాల్లో నిర్వహించే సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇటుకబట్టీలు, రాళ్లు, ఇండ్లు, వెంచర్లు, ఇతర వ్యవసాయానికి యోగ్యం కాని భూములకు రైతు భరోసా ఇవ్వరాదన్నారు. వ్యవసాయ సాగు భూములను మాత్రమే పరిగణంలోకి తీసుకోవాలన్నారు. అర్హులైన వారికి రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఓ సన్నిరాజు, ఏఈఓ సంతోషి తదితరులు ఉన్నారు.

అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేయాలి

మర్రిగూడ : ప్రభుత్వం ఈ నెల 26నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా పథకంలో భాగంగా నిర్వహించిన సర్వే శనివారం మండలంలోని ఖుదాబాక్షపల్లి, సరంపేట, కొట్టాల, కొండూరు, బట్లపల్లి గ్రామాల్లో అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బక్క శ్రీనివాసులు సర్వేను పరిశీలించి మాట్లాడారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్ధిదారుల వివరాలను తెలుసుకోవాలన్నారు. సర్వేలో ఏఓ హేమలత, జూనియర్ అసిస్టెంట్ సువర్ణ, ఏఈఓ అరుణ పాల్గొన్నారు.



మర్రిగూడ : ఏఈఓ నుంచి వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కొనసాగుతున్న భూముల పరిశీలన

కట్టంగూర్ : మండలంలోని కురుమర్తి, రామచంద్రపురం, దుగినవెల్లి గ్రామాలలో శనివారం రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయి భూముల పరిశీలన చేశారు. దుగినవెల్లిలో 3.07ఎకరాలు, రామచంద్రపురంలో 11.16ఎకరాలు, కురుమర్తిలో 58.32ఎకరాలు సాగుకు యోగ్యం గాని భూములను అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గగులోతు ప్రసాద్, వ్యవసాయాధికారి గిరిప్రసాద్, ఏఈఓ పరుశరాములు పాల్గొన్నారు.



కట్టంగూర్ : కురుమర్తిలో సాగుకు యోగ్యం కాని భూములను పరిశీలిస్తున్న అధికారులు

వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు సర్వే పరిశీలన

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో శనివారం రైతు భరోసాకు సంబంధించి వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు సర్వేను జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు నిర్ధారణకు సంబంధించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సౌమ్యశ్వేత, ఏఈఓ శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారం : సర్వే చేస్తున్న వ్యవసాయాధికారి

భక్తిశ్రద్ధలతో ‘మన అమ్మ - మన సారె’ వేడుక



అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించేందుకు ఆలయానికి వచ్చిన మహిళలు

నకిరేకల్ : పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం మన అమ్మ - మన సారె వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు స్థానిక డాక్టర్స్‌కాలనీలోని మిర్యాల రజిత ఇంటి నుంచి ఒడి బియ్యాన్ని ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకలో శ్రీ కనకదుర్గ ఆలయ చైర్‌పర్సన్ బ్రహ్మదేవర పద్మావతి, మన అమ్మ- వారి సారే వేడుక అధ్యక్షురాలు రావిరాల కవిత, ప్రతినిధులు సల్ల రమాదేవి, మూడుదుడ్ల వెంకటలక్ష్మి, కాసర్ల లక్ష్మి, రేపాల కల్యాణి, సరిత, వసంత, రమా తదితరులు పాల్గొన్నారు.

నెల్లికంటి సత్యంకు పరామర్శ

మునుగోడు : మండలంలోని ఎల్లగూడెం గ్రామంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు శనివారం ఆయనను పరామర్శించారు. అనంతరం పార్వతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ క్యామ మల్లేష్, యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్.గోవర్ధన్, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎల్.శ్రవణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మండల సమాఖ్య ఎదుట సభ్యుల ఆందోళన

మర్రిగూడ : మండల కేంద్రంలోని మండల సమాఖ్యలో శనివారం డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ శారద ఆధ్వర్యంలో మండల సమాఖ్య సభ్యురాళ్ల (ఈసీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమాఖ్య అధ్యక్షురాలిని ఏడు నెలల క్రితం 40మంది ఈసీలకుగాను 29మందిని ఎన్నుకున్నారు. ఆ ఎన్నిక చెల్లుబాటు కాదని కొత్త బైలా ప్రకారం ఆ ఎన్నిక జరగకపోవడంతో పాత బైలా ప్రకారం సభ్యుల తీర్మానం కూడా రద్దు చేయబడుతుందని ఆమె పేర్కొన్నారు. మూడు సంవత్సరాల పదవీకాలం ముగిసిన తర్వాత ఈసీ సభ్యుల సమక్షంలో ఏడు నెలల క్రితం చేసిన తీర్మాణం చెల్లదనడం సబబుకాదని ఈసీ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించి మండల సమాఖ్య ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అధక్షురాలు ఎవరనేది పూర్తి నిర్ణయం తర్వాతనే సమావేశానికి హాజరవుతామని వారు తేల్చి చెప్పారు. దీంతో పాత మండల అధ్యక్షురాలినే కొనసాగిస్తారా లేదంటే కొత్త అధ్యక్షురాలిని కొనసాగిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. కార్యక్రమంలో ఏపీఎం ప్రభాకర్, సీసీలు కిషన్, భారతమ్మ, శ్రీశైలం, ఆయా గ్రామాల వీఓఏలు, ఈసీలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత అభినందనీయం



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న మీనయ్య

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు పొందిన పేద విద్యార్థులకు చేయూత అందించేందుకు ఎస్ఎల్ఎన్ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అక్కెనపల్లి మీనయ్య అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఫౌండేషన్ ద్వారా మెడికల్ సీటు పొందిన పేద విద్యార్థులు చిన్నపాక రాకేష్, రితీష్‌కు ఆయన చేయూత చెక్కు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించిన విద్యార్థులకు కోర్సు పూర్తి అయ్యేవరకు ఆర్థిక చేయూత అందించేందుకు బీఆర్, ఎస్ఎల్ఎన్ ఫౌండేషన్‌ల అందించే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సు పూర్తి అయ్యేవరకు ట్యూషన్, హాస్టల్ ఫీజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి నాతి గణేష్ పేర్కొన్నారు. అనంతరం బాలికల ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రథమంగా నిలిచిన విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, మంజుల, షేక్ సుల్తానా, బైరెడ్డి కృష్ణారెడ్డి, చుక్క సైదులు, పెరికె మధు, శ్రీనివాస్, వెంకన్న, దశరథ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన దొంగ అరెస్ట్

కేతేపల్లి: మండలంలోని రాయపురం గ్రామంలో ఇరవై రోజుల క్రితం తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి నకిరేకల్ కోర్టులో రిమాండ్ చేశారు. కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కేతేపల్లి మండలం ఇనుపాముల ఆవాస గ్రామం రాయపురానికి చెందిన చినబత్తిని లూర్దుమేరి ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. గతేడాది డిసెంబర్ 31న లూర్దుమేరి ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లింది. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు లూర్దుమేరి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు నగలు, కొంత నగదు ఎత్తుకెళ్లారు. బాధితురాలికి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కేతేపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బందర్ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ దొంగతనం కేసులో కృష్ణా జిల్లా కృతివెన్ను మండలం సీతంపల్లి గ్రామానికి చెందిన గంట రామారావు అలియాస్ లెల్ల రంగారావును ఈ నెల 8న అక్కడి పోలీసులు విచారించారు. ఈ విచారణలో భాగంగా నిందితుడు కేతేపల్లి మండలం ఇనుపాముల ఆవాస గ్రామం రాయపురంలో చోరీ చేసినట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. ఏపీ పోలీసులు అందించిన సమాచారం మేరకు శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు రామారావును అదుపులోకి తీసుకుని విచారించగా రాయపురంలో చోరీని అంగీకరించాడు. దీంతో చోరీకి గురైన 113 గ్రాముల బంగారాన్ని నిందితుడి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పీటీ వారెంట్‌పై అరెస్ట్ చేసి నకిరేకల్ కోర్టులో రిమాండ్ చేశామని సీఐ కొండల్‌రెడ్డి పేర్కొన్నారు.

బహుమతులు అందజేత

శాలిగౌరారం : మండలంలోని పెర్కకొండారం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన కొత్తపేట టీంకు మొదటి బహుమతి, పెర్కకొండారం టీమ్‌కు ద్వితీయ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ యువజన నాయకులు కిషోర్‌యాదవ్, షెగ్గెం శంకర్, కాంగ్రెస్ నాయకులు మంగదుడ్ల శ్రీనివాస్, నూక జానయ్య, దుబ్బ వెంకన్న, వేముల బాలరాజు, దేవరకొండ నరేష్, పుల్లం శంకర్, నిర్వాహకులు నూక మిత్రసేన్, రమేష్, శివ, వెంకన్న, వీరేందర్, అంజి పాల్గొన్నారు.